క్లుప్తంగా

మంథనికి చేరిన సంకల్ప యాత్ర



ర్యాలీగా వస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మంథని: పాత పెన్షన్ పునరుద్ధరణకు వచ్చే నెల 12న హైదరాబాద్‌లో చేపట్టే ఆఖరి మోక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ పిలుపునిచ్చారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర శనివారం రాత్రి మంథనికి చేరుకోగా సీపీఎస్ ఉద్యోగులు స్వాగతం పలికారు. పాత పెట్రోల్ బంక్ నుంచి ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు లింగం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జంపాల అజయ్ పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల రిలే నిరాహార దీక్ష



దీక్షలో పాఠశాల స్వీపర్లు

పెద్దపల్లిరూరల్: మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద దీక్ష కొనసాగిస్తున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం వేతనం ఇవ్వాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అటెండర్ ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను అర్హులైన స్వీపర్లతో భర్తీ చేయాలన్నారు. స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు చిన్న రాజయ్య, లింగయ్య, వెంకటి, అనసూయ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న టీం సభ్యులు

కమాన్‌పూర్: రామగిరి మండలం లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సతీశ్ కుటుంబానికి సింగరేణి ఏఎల్‌పీ గని ఆర్‌బీ టీం సభ్యులు శనివారం రూ.10వేలు అందజేశారు. గత నెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీశ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సతీశ్ కుమారుడు చికిత్స పొందుతూ కొద్దిరోజుల వ్యవధిలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి తమవంతుగా సాయం చేసినట్లు టీం సభ్యులు తెలిపారు. కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి ఉపసర్పంచ్ ఓదెలు, టీం సభ్యులు వెంకట్, ప్రసాద్, రమేశ్, యాగదిరి, ప్రవీణ్, జయరాం, రాంబాబు, భాస్కర్‌రెడ్డి, బలరాం రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పెద్దపల్లి నుంచి పోటీ చేయాలి

సుల్తానాబాద్: పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయాలని మున్నూరుకాపు సంఘం జిల్లా కార్యదర్శి, గర్రెపల్లి సింగిల్‌విండో డైరెక్టర్ మాదాసు వెంకన్న పటేల్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పోటీ చేయడంతో నియోజకవర్గం అభివృద్ధి చెందడంతో సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రం కోసం మొదటి నుంచి పనిచేసిన వారికి పార్టీలో, పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రాధాన్యం లేదని, సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి వస్తే ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. జిల్లాకు బస్సు డిపోతో పాటు పలు రకాల కళాశాలలు వచ్చే అవకాశం ఉంటుందని, మౌలిక సదుపాయాలు రోడ్లు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు.

కట్టకు గండి పడకుండా ముందస్తు చర్యలు



సుల్తానాబాద్: వరదతో చెరువు కట్ట గండి పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత తెలిపారు. సుల్తానాబాద్ ఊర చెరువు వద్ద కట్టకు పలు ప్రాంతాల్లో గండి పడే అవకాశం ఉన్నందున శనివారం ముందస్తుగా ట్రాక్టర్ ద్వారా మొరం పోసి చర్యలు చేపట్టారు.

పేరుకే క్రీడాప్రాంగణం

- గుంపులలో లోతైన స్థలంలో ఏర్పాటు చేయడంతో నిలిచిన వర్షం నీరు
- సరైన స్థలంలో ఏర్పాటు చేయాలని క్రీడాకారులు, గ్రామస్తుల డిమాండ్



క్రీడాప్రాంగణంలో నిలిచి ఉన్న నీరు

ఓదెల: మండలంలోని గుంపులలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడాప్రాంగణంలో వర్షం నీరు నిలిచింది. వరుస వర్షాలతో క్రీడాప్రాంగణాలు పూర్తిగా జలమయం అయ్యాయి. దీంతో గ్రామంలోని క్రీడాకారులు ఆటలకు దూరమయ్యారు. ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన క్రీడాప్రాంగణం ఏర్పాటు విషయంలో సరిన్న స్థలం ఎంపిక చేయలేదు. లోతైన ప్రదేశంలో నిర్మించి చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పేరుకే క్రీడాప్రాంగణం అన్న చందంగా ఏర్పాటు చేయటంతో వర్షం నీరంతా చేరి తుంగగడ్డితో నిండిపోయింది. క్రీడాప్రాంగణం నామమాత్రంగా ఏర్పాటు చేసి బిల్లులు పొందారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్డు నిర్మాణం కోసం మట్టితీసిన లోతైన గొయ్యిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారని క్రీడాకారులు, గ్రామస్తులు వాపోయారు. సరైన ప్రదేశంలో క్రీడాప్రాంగణం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల: బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రె నాయకులకు కండ్లమంట వస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుంపుల గ్రామంలో శనివారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతుసమన్వయ సమితి మండల చైర్మన్ కావటి రాజు, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు తిప్పారపు చిరంజీవి, ఆళ్ల రాజిరెడ్డి, తొల్సూరి కొమురయ్యయాదవ్, గుండేటి మధుయాదవ్, అంబాల శ్రీనివాస్, గోవిందుల ఎల్లస్వామి, ఉపసర్పంచ్ గట్టు మహేశ్‌గౌడ్, నాయకులు గట్టు శ్రీనివాస్, మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానీయొద్దు

సుల్తానాబాద్‌రూరల్: రైతులకు ఉచిత విద్యుత్ దండగ అని అన్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమికొట్టాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని రైతువేదికలో శనివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, రైతుబంధు మండల కన్వీనర్ రాజమల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులు నిలదీయాలి

కాల్వశ్రీరాంపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ రైతులను తప్పదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో రైతన్న మేలుకో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, రైతుసమితి మండల కోఆర్డినేటర్ దేవయ్య, వైస్‌ఎంపీపీ శిరీష, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీసీ సంఘం నాయకులు



కలెక్టర్‌తో బీసీ నాయకులు

పెద్దపల్లిరూరల్: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను శనివారం బీసీ సంక్షేమ సంఘ నాయకులు వివేక్ పటేల్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరోజ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కాంట్రాక్టు కార్మికుల వివరాల డిజిటలైజేషన్‌పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను ఆన్‌లైన్ డిజిటలైజేషన్‌పై అధికారులకు శనివారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌లో శిక్షణ నిర్వహించారు. ఇన్‌మస్టర్ శాప్‌లో నమోదు, వారి వ్యక్తిగత వివరాలను శాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు, ఆరోగ్య వివరాలు, మెడికల్ హిస్టరీ తదితర వివరాలను ఎంటర్ చేయాలో ఐటీ డీజీఎం హరిశంకర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏరియాలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏరియా సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ, డీజీఎం ఏరియా వర్క్‌షాప్ మదన్‌మోహన్, ఐ టీ మేనేజర్ రాజేశ్, సంక్షేమ అధికారులు హనుమంతరావు, గణేశ్, ఫిరోజ్‌ఖాన్, రవీందర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జ్యోతినగర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ బాధితుడికి అందించారు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి అన్నపూర్ణకాలనీకి చెందిన భాస్కర్ మేలో తన శాంసంగ్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్(సీఈఐఆర్) విధానం ద్వారా సెల్‌ఫోన్‌ను కనుగొన్నారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం భాస్కర్‌కు ఎస్సై ఫోన్ అందించారు. సీఈఐఆర్ ఆపరేటర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

వరద కాలువ పూడికతీత పనులు ప్రారంభం

జ్యోతినగర్: న్యూపోరట్‌పల్లి మీదుగా గోదావరినది వైపు ఉన్న వరదకాలువ పూడితీత పనులను శనివారం కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ ప్రారంభించారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లోని న్యూపోరట్‌పల్లి మీదుగా వెళ్తున్న వరదకాలువతో ప్రతి ఏటా వరదనీటి ముప్పుతో స్థానిక ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్న క్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థ సహకారంతో వరదకాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్డీవోను కలిసిన టీఎన్‌జీవో నేతలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన మధుమోహన్‌ను శనివారం టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకూరి శంకర్, రాజనరేందర్‌గౌడ్ కలిసి సత్కరించారు. సుధీర్, ప్రవీణ్, సురేశ్, నర్సారెడ్డి, తిరుపతి, చంద్రమౌళి ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి

జ్యోతినగర్: ఎన్టీపీసీ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రావికంటి అంజయ్య అన్నారు. అన్నపూర్ణ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. అనంతరం గోదావరిఖని పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు గడ్డం రవీందర్, కోటగిరి శ్రీకాంత్‌రావు, పల్లెర్ల కిషన్, ప్రసాద్, అశోక్, సత్యం, చంద్రశేఖర్, 3వడివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్ అంజయ్యను సన్మానించారు.

వెంకట్రావుపల్లి గ్రామ సమస్యలు పరిష్కరించండి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కేకేనగర్ వాసులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం గ్రామ నాయకులు ప్రజలతో కలిసి ఆర్జీ–2 జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కేకేనగర్‌లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాలకు వర్షం నీరు రాకుండా చూడాలని, డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కోరారు. పోచమ్మ గుడి శిథిలావస్థలో ఉందని, మరమ్మతు చేపట్టాలన్నారు. నాయకులు బుర్ర ముత్యాలగౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్, సంపత్తి, చంద్రయ్య, రాములు, రమేశ్, తిరుపతి, ఓదెలు, బీఆర్ఎస్ రామగిరి మండల అధ్యక్షుడు రవీందర్, రామగిరి జెడ్పీటీసీ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ **భాగవతంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

మంథని: మంథనిలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్రాగజ్ఞాన యజ్ఞం, మద్దేవి భాగవతంలో ఎమ్మెల్యే శ్రీధరబాబు పాల్గొని ఆశీర్వాదం తీసుకున్నారు. పురాణం మహేశ్వర్‌శర్మ మద్దేవి భాగవతం, వేద పండితుడు పాలెపు భరత్మ శర్మతో భాగవత సప్తాహం జరుగుతోంది. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, సెగ్గెం రాజేశ్, అజీంఖాన్, ఎరుకల ప్రవీణ్, నూకల బానయ్య ఉన్నారు.

✦ **పంచాయతీ కార్యదర్శి బదిలీ**

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్ పంచాయతీ కార్యదర్శి అర్చన వెల్గటూరు మండలం ముంజంపల్లికి బదిలీ అయ్యారు. కోనరావుపేటలో విధులు నిర్వహిస్తున్న సంపత్‌కు అబ్బాపూర్ పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

✦ **బీఎల్‌వోలకు శిక్షణ**

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని బూత్‌స్థాయి అధికారి(బీఎల్‌వో)లకు శనివారం మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ట్రెయినీలు ఆగయ్య, హరిప్రసాద్, సంపత్‌రావు, శ్రీనివాస్, శ్రీధర్‌రావు, రాజేశ్వరావులు బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్లు దత్తుప్రసాదరావు, రామ్మోహన్ పాల్గొన్నారు.

✦ **వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు**

పాలకుర్తి: బసంత్‌నగర్ స్టాఫ్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అండాళ్ తిరునక్షత్ర, గోదాదేవి జయంతి పర్వదినం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు.

✦ **కాంగ్రెస్‌లో చేరిక**

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోగుల వీరారెడ్డి, బీజేపీ నాయకుడు ఎండీ సల్లావుద్దీన్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

✦ **మొక్కలు నాటి సంరక్షించాలి**

సుల్తానాబాద్: కాలనీల్లో మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కౌన్సిలర్ కూకట్ల గోపి కోరారు. శనివారం యాదవ నగర్‌లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్ ఉన్నారు.

✦ **స్వామివారికి వెండి వడ్డాణం బహూకరణ**

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీగణేశ, రాజరాజేశ్వరి కిట్టి పార్టీ సభ్యులు వొడ్డాణం సమర్పించారు. అనంతరం అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని గోమాతకు పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి, ఒడి బియ్యం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ, సభ్యులు పల్లా భగవాన్, కొమరవెల్లి ప్రభాకర్, అల్లంకి ప్రభాకర్, అర్చకులు మహేశ్, రమేశ్, అమ్మవార్ల రజిత, శైలజ పాల్గొన్నారు.


✦ **ఏఐటీయూసీ జీడీకే–2ఏ గని నూతన పిట్ కమిటీ ఎన్నిక**

గోదావరిఖని: ఏఐటీయూసీ ఆర్జీ–1 జీడీకే–2ఏ గని నూతన పిట్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పిట్ సెక్రటరీగా నాగేంద్రకుమార్, సహాయ కార్యదర్శులుగా వెంకన్న, అంజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మోహన్, శంకరయ్యతో పాటు మరో 50మంది డెలిగేట్‌లను ఎన్నుకున్నారు.

✦ **గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తు గడువు పొడగింపు**

గోదావరిఖనిటౌన్: వరుసగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన సెలవుల కారణంగా గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తు గడువును 25వ తేదీ వరకు పొడిగించగా, పెద్దపల్లి డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలను 26కు వాయిదా వేసినట్లు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్ అహ్మద్ శనివారం తెలిపారు.

జాతీయ జెండా ప్రాముఖ్యాన్ని స్మరించుకోవాలి



ర్యాలీలో మగువ ప్రతినిధులు

కోల్‌సిటీ: జాతీయ జెండా ప్రాముఖ్యాన్ని ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలని రామగుండం మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, ప్రధాన కార్యదర్శి గాలి సునీత తెలిపారు. కాగా శనివారం జాతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా గోదావరిఖనిలో మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పింగళి వెంకయ్య రూపొందించిన భారత జాతీయ జెండాను, భారత రాజ్యాంగ అసెంబ్లీ 1947 జూలై 22న ఆమోదించిందని, ప్రతీ ఏడాది జూలై 22న జాతీయ జెండా ఆమోద దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు సంక్షేమరెడ్డి, జ్యోతి, సద్గుణ, నీల, సౌజన్య, విమల పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంథని: గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం క్యాంపు కార్యాలయంలో పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన ప్రకారం వేతనం చెల్లించాలని కోరారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం గ్రామంలో అధికారులు డేలీ లేబర్‌తో పారిశుధ్య పనులు చేయిస్తుండగా జీపీ కార్మికులు అడ్డుకున్నారు. తమకు మద్దతు తెలిపి సహకరించాలని యూనియన్ నాయకులు గ్రామస్తులను కోరారు.

ఓదెల: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఓదెలలో సమ్మె కొనసాగుతోంది.

జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట వేసిన దీక్షా శిబిరంలో గ్రామాల నుంచి తరలివచ్చిన కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. కుమ్మరికుంట సర్పంచ్ మేచినేని సంతోశ్‌రావు కార్మికులకు మద్దతు తెలుపుతూ భోజనం ఏర్పాటు చేశారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై శనివారం రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్ గ్రామ ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానంపై వీవీ ప్యాట్‌లను ఉపయోగించే పద్ధతులను ప్రజలకు వివరించారు. ఓటు వేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఈవో అరవింద్, పీసీ బాలకృష్ణ, వెంకట్రావుపల్లి గ్రామప్రజలు పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్, వేంనూర్ గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాడ్‌ల నమూనాలను ఏర్పాటు చేసి ఓటుహక్కు వినియోగం, దాని ప్రాముఖ్యం గురించి వివరిస్తూ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ ఉమాశంకర్ తెలిపారు. ఏఎస్ఐ గౌస్‌ఖాన్, ఆర్ఐ అమృతకుమార్, ఎన్నికల ప్రచార రథం ఇన్‌చార్జి శశిధర్, కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: మణిపూర్ ఘటనను నిరసిస్తూ సీపీఎం నాయకులు శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు వై.యాకయ్య, తుమ్మల రాజారెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

గోదావరిఖనిటౌన్: కొన్ని నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ గోదావరిఖని ఆధ్వర్యంలో శనివారం జూనియర్ సివిల్‌జడ్జి కోర్ట్‌ఎదుట న్యాయవాదులు నిరసనలు తెలిపారు. న్యాయవా దుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శైలజ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌కుమార్, ము రళి, లింగస్వామి, వరలక్ష్మి, సుజాత, రేష్మ పాల్గొన్నారు.

‘మణిపూర్ ఘటనపై కేంద్రం వైఖరి సరికాదు’

రామగుండం: మణిపూర్ రాష్ట్రంలో రెండు వర్గాల మధ్య కొంతకాలంగా రాష్ట్రం అట్టుడికిపోతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్ అన్నారు. శనివారం అంతర్గాంలో విలేకరులతో మాట్లాడారు. మణిపూర్ ఘటనపై పీఎం మౌనం వీడి తక్షణమే శాంతి సామరస్యాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన కార్మిక సంఘం నాయకులు



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంట్ యూనియన్ నాయకులు శనివారం మంత్రి మల్లారెడ్డిని కలిశారు. కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యవేని శ్రీనివాస్ హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. కేశోరాం కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగ విరమణ వయస్సును 61ఏళ్లకు పెంచాలని, ఇందుకు సంబంధించిన జీవో విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి కంపెనీ ఉన్నతాధికారులతో చర్చించి కార్మికుల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు పోతుల ప్రసాద్, ఈదునూరి నారాయణ, పుప్పాల రమేశ్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం టీఎన్టీయూసీ అధ్యక్షుడు సల్ల రవీందర్, సంఘపు రాజు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం ఆవేదనకు గురిచేస్తోందన్నారు. కొత్త ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి సన్మానం

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కీర్తి రాజేశ్వరి–లక్ష్మయ్య దంపతుల మొదటి కూతురు కీర్తి శరణ్య ఇటీవల వెల్లడించిన నీట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 979 ర్యాంకు సాధించింది. పేద కుటుంబం కావడంతో దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ తానిపర్తి బానుప్రసాదరావుకు ఈ విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు వివరించడంతో ఆయన స్పందించి వైద్య విద్యకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని చెప్పినట్లు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎలిగేడులో విలేకరుల సమావేశంలో తెలిపారు. అనంతరం కీర్తి శరణ్యను సత్కరించారు. కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వర్‌రావు, ఎంపీపీ స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక, సర్పంచ్ సింధూజ, సింగిల్‌విండో చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఖలీల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ సర్పంచులు సుధాకర్‌రావు, సమ్మయ్య పాల్గొన్నారు.

అవగాహనతోనే సత్వర న్యాయం



మాట్లాడుతున్న శంకర్

జ్యోతినగర్: ప్రజలకు హక్కులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్నప్పుడే సత్వర న్యాయం జరుగుతుందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ అన్నారు. శనివారం రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని ఏకలవ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన హ్యూమన్ రైట్స్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. నేడు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, అవమానకరమైన సంఘటనలు అధికం కావడం శోచనీయమని అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజలందరూ మానవ హక్కులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. జిల్లా నాయకుడు సతీశ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్, రవీందర్, సురేష్, శ్రీకాంత్, రమేశ్, సంజీవ్, అశోక్ పాల్గొన్నారు.